క్లుప్తంగా

దరఖాస్తుల స్వీకరణ

సనత్‌నగర్: బేగంపేటలోని మహిళా డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టుల్లో బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మావతి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ (2 పోస్టులు), ఎకనామిక్స్ (3), కామర్స్ (3), కెమిస్ట్రీ (3), మ్యాథ్స్ (3), బోటనీ (2), మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం (1)లకు గాను బోధనా సిబ్బందిని తీసుకోవడం జరుగుతుందన్నారు. జనవరి 2 సాయంత్రం 5 గంటల్లోగా అభ్యర్థులు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. 3న ఉదయం 10 గంటలకు బేగంపేట మహిళా డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూలు ఉంటాయని వివరించారు.

డైరీ ఆవిష్కరణ



విబ్సన్ ఫార్మా డైరీని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: నగరానికి చెందిన ప్రముఖ విబ్సన్ ఫార్మా వార్షిక డైరీని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మా రంగంలో అధునాతన మార్పులు రోగులకు మేలు చేకూర్చేలా ఉండాలని ఆకాంక్షించారు. విబ్సన్ ఫార్మా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, బీఆర్ఎస్ నేత సుంకు రామ్‌చందర్, కార్పొరేటర్లు హేమ, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఓయూ పూర్వ విద్యార్థులకు హాస్టల్ భోజనాలు

ఉస్మానియా యూనివర్సిటీ: గ్లోబల్ అలుమ్ని మీట్–2023లో భాగంగా ఓయూ పూర్వవిద్యార్థులకు భోజన సదుపాయాన్ని క్యాంపస్‌లోని వివిధ హాస్టళ్లలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆదివారం అధికారులు తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో జరిగే కార్యక్రమంలో 4న మధ్యాహ్నం భోజనాన్ని ఆయా హాస్టళ్ల మెస్సులలో ప్రస్తుత విద్యార్థులతో కలిసి తినేలా ఏర్పాటు చేశామన్నారు. హాస్టళ్లలో జరిగిన నాటి మధుర జ్ఞాపకాలను పూర్వవిద్యార్థులు నెమరవేసుకొని పంచుకునేలా పాతబడి మూసివేసిన ఏ, బీ హాస్టల్ భవనాలను తెరువనున్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల ప్రారంభం



డ్రైనేజీ పైప్‌లైన్ పనులు ప్రారంభిస్తున్న రామకృష్ణ తదితరులు

రసూల్‌పురా: కోమటి నాగయ్య గల్లీ, రావీ చెట్టు గల్లీ, ట్రాన్స్‌ఫార్మర్ గల్లీల్లో బోర్డు నిధులతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైను పనులను బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసూల్‌పురాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని మాటిచ్చిన కేసీఆర్ మరచిపోయాడని కాని బీజేపీ మాట ఇవ్వకుండానే పలు అభివృద్ధి పనులు చేపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మాదారపు అశోక్, జై యాదవ్, లక్ష్మణ్, ప్రశాంత్, ప్రభు, స్థానికులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధ్యక్షుడిగా పిడమర్తి రవికి అవకాశం ఇవ్వండి



మాట్లాడుతున్న బోరెల్లి సురేష్‌మాదిగ

ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్ఎస్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా పిడమర్తి రవికి అవకాశం ఇవ్వాలని తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ బోరెల్లి సురేష్ ఆ పార్టీ జాతీయ నేత, రాష్ట్ర సీఎం కేసీఆర్‌ను కోరారు. ఆదివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ.. చిన్న నాటి నుంచి విద్యార్థి నేతగా పోరాడిన పిడమర్తి రవి బీఆర్ఎస్ అధ్యక్షపదవికి అర్హుడన్నారు. గతంలో రెండు సార్లు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా, రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు పిడమర్తి రవికి అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్ ఈసారి బీఆర్ఎస్ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాకు చెందిన మాదిగ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో.. టమాటా రూ.11, నల్ల వంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 40, పచ్చిమిర్చి 37, బజ్జీ మిర్చి 28, క్యాప్సికమ్ 35, పచ్చకాకర 40, పందిరిబీర 40, క్యాబేజీ 10, క్యారెట్ 19, దొండ 28, గుండుబీన్స్ 45, గింజ చిక్కుడు 35, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 24, ఆలుగడ్డ 32, చామగడ్డ 45, మొరంగడ్డ 21, కందగడ్డ 21, సొరకాయ 13, పొట్లకాయ 13.

అంబరాన్నంటిన 'నయా' సంబరాలు

సనత్‌నగర్: 2023 కొత్త సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. కుటుంబసభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గుడ్‌బై 2022.. వెల్‌కమ్ 2023 అంటూ ముంగిళ్లలో ఆకట్టుకునేలా ముగ్గులు వేశారు. కొత్త ఏడాది సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చర్చిల్లో క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా, మెథడిస్ట్ చర్చి, ఎంబీ ఇమానుయేల్ చర్చి, బాప్టిస్ట్ చర్చి, బల్కంపేట్ యునైటెడ్ చర్చి తదితర ప్రార్థనా మందిరాలను విద్యుద్దీపాలతో శోభయామానంగా తీర్చిదిద్దారు.

రాష్ట్ర ప్రజలంతా సుఖః సంతోషాలతో ఉండాలి: మంత్రి తలసాని..

- నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రజలు సుఖః సంతోషాలు, సిరి సంపదలతో ఉండాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆకాంక్షించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆదివారం తనను కలిసిన అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఉస్మానియావర్సిటీ వైస్‌ఛాన్సలర్ రవీందర్, ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ అమరవాది లక్ష్మీనారాయణ, మహంకాళి, గోపాలపురం ఏసీపీలు రమేష్, సుధీర్, సీఐలు శ్రీనివాస్‌రావు, ముత్తుయాదవ్, సైదులు, పలువురు బీఆర్ఎస్ నాయకులు, ఇతర అధికారులు మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.
- బేగంపేట కట్టమైసమ్మ ఆలయంలో బేగంపేట కార్పొరేటర్ మహేశ్వరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖః సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.



మంత్రి తలసానికి ఆశీర్వచనాలు అందిస్తున్న ఎల్లమ్మ ఆలయ అర్చకులు

బేగంపేట బీజేపీ కార్యాలయంలో..

- బేగంపేటలోని మర్రి శశిధర్‌రెడ్డి కార్యాలయంలో ఆయనను బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ ముస్లిం మైనార్టీ నేత షేక్ గౌస్, కేబుల్ శ్రీనివాస్ రెడ్డి, వంశీకృష్ణ, నరేందర్ తదితరులు మర్రిని కలిసి గ్రీటింగ్స్ అందజేశారు.

తార్నాకలో ..

లాలాపేట: తార్నాకలోని ఐనోస్ చర్చిలో, లాలాపేటలోని మెథడిస్టు చర్చి, శాంతినగర్‌లోని బాప్టిస్టు చర్చి, ఎవాంజలికల్ బాప్టిస్టు చర్చిల్లో అర్ధరాత్రి వరకు ప్రత్యేక ప్రార్థనలు, కార్యక్రమాలతో నూతన సంవత్సరానికి ఆహ్వానం పలికారు. కేక్‌లు కట్ చేస్తూ శుభాకాంక్షలు తెలిజేసుకున్నారు. చర్చి పాస్టర్ రెవరెండ్ డాక్టర్ సంజీవ పాల్, సంఘం నాయకులు బొస్కుల కొమురయ్య, పుష్ప, కిరణ్‌కుమార్ తదితరులున్నారు.

చిలకలగూడలో..

చిలకలగూడ: చిలకలగూడ ఠాణా పరిధిలో న్యూ ఇయర్ వేడుకలు సందడి జరిగాయి. సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ కుటుంబసభ్యులతో నామాలగుండు కల్యాణ వెంకన్న స్వామిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు ఆమెను సన్మానించి ప్రసాదం అందజేశారు. నాగులూరి నర్సింహా జీహెచ్‌ఎంసీ పార్కులో సికింద్రాబాద్ షటిల్ రైడర్స్ ఆధ్వర్యంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేసి ఆటాపాటలతో సందడి చేశారు. చిలకలగూడ ఠాణా పరిధిలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగలేదని సీఐ నరేష్ తెలిపారు.



మర్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న షేక్ గౌస్



లాలాపేట మెథడిస్టు చర్చిలో..



నాగులూరి పార్కులో షటిల్ రైడర్స్ ఆధ్వర్యంలో..



కుటుంబసభ్యులతో కలిసి పూజలు చేస్తున్న కార్పొరేటర్ హేమ



బేగంపేట కట్టమైసమ్మ ఆలయంలో.. కార్పొరేటర్ మహేశ్వరి

గవర్నర్‌కు శుభాకాంక్షలు

అడ్డగుట్ట: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని గవర్నర్ తమిళిసైని అడ్డగుట్ట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు గంట రాజుసాగర్ నేతృత్వంలో పలువురు పార్టీ నేతలు కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. సికింద్రాబాద్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనంత కృష్ణారావు, ఎస్సీ సెల్ హైదరాబాద్ జాయింట్ కన్వీనర్ భూపతి హరి ఉన్నారు.



గవర్నర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గంటరాజు

మంత్రి తలసానికి..

అమీర్‌పేట: మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు అమీర్‌పేట, మాజీ కార్పొరేటర్ శేషుకుమారి మహిళా నాయకులతో కలిసి ఉదయం మంత్రి నివాసానికి వెళ్లి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు లక్ష్మి, విజయదుర్గ, లలిత, సంతోష్, కట్ట బల్‌రాం, కూతురు నర్సింహ తదితరులు పాల్గొన్నారు.



మంత్రి తలసానికి శుభాకాంక్షలు తెలిపిన మహిళా నాయకులు

రేవంత్‌రెడ్డికి..

రాంగోపాల్‌పేట్: బోయిన్‌పల్లి మార్కెట్ యార్డు మాజీ డైరెక్టర్, యువజన కాంగ్రెస్ నగర మాజీ ప్రధాన కార్యదర్శి గంటా సుధీర్ కుమార్ ఆదివారం టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేదపండితులతో ఆశీర్వచనాలు అందించారు.



శుభాకాంక్షలు తెలుపుతున్న గంటా సుధీర్‌కుమార్

కేలండర్ల ఆవిష్కరణ



కేలండర్‌ను ఆవిష్కరించిన మంత్రి తలసాని

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో ఆవిష్కరించారు. ముందుగా మంత్రిని ఆలయ పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా మంత్రికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శేషుకుమారి, ఆలయ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్, ఈఓ అన్నపూర్ణ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



బోలక్‌పూర్‌లో ..

పద్మారావునగర్: బోలక్‌పూర్‌లో శ్రీ క్రిష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో నూతన సంవత్సర కేలండర్‌ను సంస్థల చైర్మన్ సంగని రాజు ఆవిష్కరించారు. ఈ నూతన కేలండర్‌ను అనేక కొత్త విషయాలు, సమాచారాన్ని పొందుపర్చి రూపొందించినట్లు కరస్పాండెంట్ డాక్టర్ మంచాల శ్రీనివాసులు తెలిపారు. ఈ నూతన సంవత్సరం అందరికీ మంచి జరగాలని, విద్యార్థులు అన్ని విధాలా రాణించాలని ఆకాంక్షించారు.

అగ్ని ప్రమాదం

రాంగోపాల్‌పేట్: మోండా మార్కెట్‌లోని ఓ పూజా సామగ్రి గోదాంలో అగ్ని ప్రమాదం చోటుచేసికుంది. ఆదివారం ఉదయం 2గంటల ప్రాంతంలో మోండా మార్కెట్‌లోని లక్ష్మణ్ అండ్ సన్స్‌కు చెందిన పూజా సామగ్రి గోదాంలో నుంచి మంటలు రావడాన్ని గమనించిన స్థానికులు వెంటనే మార్కెట్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పేందుకు యత్నించారు. కొద్దిసేపటి అనంతరం మంటలు అదుపులోకి వచ్చాయి. అయితే గోదాంలోని సామగ్రి మొత్తం అగ్నికి ఆహుతయ్యింది. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా కాల్చిన బాణసంచాతో అగ్నిప్రమాదం జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

సనత్‌నగర్: అశోక్‌కాలనీలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత సయ్యద్ సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. తన తండ్రి సయ్యద్ ఇమాముద్దీన్ స్మారకార్థం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించిన ఈ శిబిరంలో దాదాపు 300 మంది వరకు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ముఖ్యఅతిథులుగా సనత్‌నగర్ ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్, బీఆర్ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు బాల్‌రెడ్డి హాజరయ్యారు. వైద్యులు మమత, మంజీత్ తమ సేవలను అందించారు. ఖలీల్‌బేగ్, ఫాసిల్, రాజు, జమీర్‌బేగ్, వీరేష్, హరిత పాల్గొన్నారు.



చిలకలగూడ ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన జీడీఎక్స్ ప్రతినిధులు



గాంధీఆస్పత్రి: గాంధీఆస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ సేవలు అందిస్తున్న జీడీఎక్స్ సెక్యూరిటీ అండ్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రతినిధులు ఆదివారం చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ నరేష్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో సెక్యూరిటీ వ్యవస్థ మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామన్నారు. నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సెక్యూరిటీగార్డులకు దశలవారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. అనంతరం నరేష్‌కు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడీఎక్స్ ప్రతినిధి రవికుమార్, మేనేజర్ బాబురావు, సెక్యూరిటీ ఇన్‌చార్జి శివాజీ, సూపర్‌వైజర్ కార్తీక్ పాల్గొన్నారు.

బైరి నరేష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయాలి

సనత్‌నగర్: అయ్యప్ప స్వామిపై అనుచిత వ్యాఖ్యలు చేసి బైరి నరేష్‌పై పీడీ యాక్ట్ నమోదు చేయడంతో పాటు కఠినంగా శిక్షించాలని బీజేపీ మేడ్చల్ జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు నెమలి ఆనంద్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. హిందూ దేవుళ్లపై విమర్శలు చేయడం ఇటీవల కాలంలో ఫ్యాషన్ అయిపోయిందన్నారు. హరిహర పుత్రుడైన అయ్యప్పను దూషించిన వారు ఎవరైనా కఠినంగా శిక్షించాలన్నారు. కులాలు, మతాలు వేరయినా కలిసిమెలసి జీవించే భారతీయ సంస్కృతిని చెడగొట్టే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. బైరి నరేష్‌ను కఠినంగా శిక్షించే వరకు ఆందోళనలు ఆపేది లేదని హెచ్చరించారు.

ముక్కోటి ఏకాదశికి సర్వం సిద్ధం

- సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న ఆలయాలు
- ఏర్పాట్లను పూర్తి చేసిన ఆలయాల నిర్వాహకులు

చిలకలగూడ: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని వేంకటేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. నామాలగుండులోని కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వెంకన్న స్వామి ఆలయాల్లో ఈనెల 2, 3 తేదీల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్తరద్వార దర్శనం, పూజలు, అభిషేకాలు, సర్వదర్శనం తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో సుమారు రెండు లక్షల మంది పాల్గొనే అవకాశం ఉందని, పలు ప్రభుత్వ విభాగాల నేతృత్వంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టామని, తిరుమల తిరుపతి, అయోధ్య రాముడు దశావతారాలు, సెట్టింగులు ప్రత్యేక ఆకర్షణగా ఏర్పాటు చేస్తున్నట్లు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు తెలిపారు. శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి వేడుకలను కనుల పండువగా నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశామని ఆలయ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, ఈఓ రాజేష్‌కుమార్ తెలిపారు.

వేడుకల్లో పాల్గొననున్న చినజీయరుస్వామి..

నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహించే ముక్కోటి ఏకాదశి వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొననున్నట్లు ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు తెలిపారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయరుస్వామి, మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్, డిప్యూటీ స్పీకర్ పద్మారావుతోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, పలు విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొంటారని తెలిపారు.

సనత్‌నగర్‌లో..

సనత్‌నగర్: సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా సోమవారం సప్త ద్వారాల ఉత్తర ద్వార దర్శన భాగ్యం కలిగిస్తున్నారు. అందుకు ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తున్నారు.

పెరుమాళ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..

రాంగోపాల్‌పేట్: శివాజీనగర్‌లోని పెరుమాళ్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో 2న ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఈఓ సత్యమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో ఆయన మాట్లాడుతూ.. సోమవారం ఉదయం ఉదయం 2 గంటలకు స్వామివారికి సుప్రభాత సేవ ఉంటుందని అనంతరం తిరువల్లి, తిరుప్పావడై ప్రత్యేక పూజలు జరుగుతాయని ఉదయం 4 నుంచి 5గంటల వరకు దాతలకు ప్రత్యేక దర్శనం 5గంటల నుంచి సాధారణ భక్తులకు దర్శనం ఉంటుందని చెప్పారు. ఈ ఉత్సవాల్లో మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మల్లారెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు, ఎమ్మెల్యే సాయన్న పలువురు ప్రముఖులు హాజరుకానున్నారన్నారు.



నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం



తిరుమల తిరుపతి సెట్టింగ్



ఉత్తరద్వారాలు

5న కంటోన్మెంట్ బోర్డు సమావేశం

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు సమావేశం గురువారం జరగనుంది. ఈ మేరకు అధికారులు వెల్లడించారు. సీఈఓ మధుకర్ నాయక్ పదవీ బాధ్యతలు స్వీకరించిన దాదాపు రెండు నెలలు పూర్తి కావస్తుండగా, ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తొలి సమావేశం ఇది కావడం గమనార్హం. పూర్తిస్థాయి పాలకమండలి రద్దు అయ్యి దాదాపు రెండేళ్లు అవుతున్నా ఇప్పటికీ ఎన్నికల ఊసే లేదు. ఇద్దరు అధికారులు, సివిలియన్ నామినేటెడ్ సభ్యుడితో కూడిన ముగ్గురు సభ్యుల వేరీడ్ బోర్డు ఆధ్వర్యంలో పాలన సాగుతోంది. ఈ క్రమంలోనే రెండేళ్ల పాటు సీఈఓగా పనిచేసిన అజిత్ రెడ్డి బదిలీ కాగా ఆయన స్థానంలో నూతన సీఈఓగా మధుకర్ నాయక్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. సీఈఓలు మారిన ప్రతీసారీ బోర్డు పాలనలో తమదైన మార్పును చూపిస్తూ రావడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం నాటి సమావేశం తీరుతెన్నులపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

9న సీనియర్ సిటిజన్స్‌కు క్రీడా పోటీలు

సనత్‌నగర్: ఖైరతాబాద్ సర్కిల్–17 ఆసరా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 9న ఇండోర్ గేమ్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ కమిటీ ఉపాధ్యక్షుడు జేఎస్‌టీ శాయి ఓ ప్రకటనలో తెలిపారు. మోడల్ కాలనీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవనంలో ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం వరకు ఈ పోటీలు జరుగుతాయన్నారు. క్యారమ్స్ (సింగిల్ అండ్ డబుల్స్), చెస్, జనరల్ నాలెడ్జ్ తదితర అంశాల్లో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి గల సీనియర్ సిటిజన్స్ ఈనెల 7వ తేదీ లోపు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. డిప్యూటీ కమిషనర్ మోహన్‌రెడ్డి హాజరై ఈ పోటీలను ప్రారంభిస్తారన్నారు. పోటీల్లో పాల్గొనదలచిన వారు క్యారమ్స్‌కు సంబంధించి కృష్ణారెడ్డి (98660 45059), వైకేడీ ప్రసాద్ (94939 74300). చెస్‌కు సంబంధించి జే. ప్రసాద్ (89779 14856), జనరల్ నాలెడ్జ్ అంశానికి సంబంధించి జేఎస్‌టీ శాయి (90001 55432)లను సంప్రదించాలన్నారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

కంటోన్మెంట్: మహిళా సంఘాలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని బోర్డు మాజీ ఉపాధ్యక్షురాలు భానుక నర్మద అన్నారు. రాజీవ్, గోదావరి మహిళా సంఘాలకు రూ.10 లక్షల చొప్పున మంజూరైన రుణ మొత్తాలను ఆదివారం భానుక నర్మద చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సొమ్ముతో తగిన స్వయం ఉపాధి అవకాశాలు కల్పించుకోవాలని భానుక నర్మద సూచించారు. అంతకు ముందు మహిళా సంఘాల సభ్యులతో కలిసి భానుక నర్మద దంపతులు నూతన సంవత్సర కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు.